పడి సంపాయించింది కాదని ఆలోసించిన. ఎవ్వరు సూడకుంట సూసి గొలుసు తప్పదీసిన. ఇది పున్నెమో పాపమో నాకు ఎరక లే- అటు తర్వాత ఏమయిన మంచిదే అని గొలుసమ్మి రెండు పొట్టేలును కొనుక్కచ్చిన. మిగతా పైసలు కొంపుల్ల ఉన్నయి. తెలువకుంట ఆళ్ళింట్లనే పారేసచ్చిన. నేం చేసింది తప్పో ఒప్పో సెప్పండ్రి అన్నాడు రామయ్య.

అతని మాటలు విన్న జనమంతా భారంగా నిట్టూర్చారు.

(చిత్రిక నవంబర్ ౮౩ సంచికలు)

# 6. స్వాతంత్ర్యం వచ్చింది

స్వాతంత్ర్య దినపు అలంకారాలతో పట్టణమంతా శోభాయమానంగావుంది. రంగురంగుల కాగితాలతో ప్రతి ఆఫీసు, కాలేజి, పాఠశాల అలంకరింపబడి కనుల పండుగగా వుంది. ప్రభుత్వోద్యోగులు స్వాతంత్ర్య దిన వేడుకల హడావిడిలో తలమునకలై యున్నారు. నాయకమన్యుల ఉపన్యాసాలు ధారాళంగా సాగుచున్నవి. మాయమర్మ మెరుగని పిల్లలు ఆటపాటలలో ఉత్సాహంగా పాల్గొంటూ కేరింతలు కొడుతున్నారు. కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాట్లలో కొందరు హడావిడి పడుతున్నారు. రకరకాలయిన కార్యక్రమాలతో పట్టణమంతా గజిబిజిగా వుంది.

ఇవన్నీ తనకేమి పట్టనట్లుగ వృద్ధుడు మాసిన తలతో

పెరిగిన గడ్డంతో, మాసికలుపడ్డ పైజామాతో, నాలుగైదు రంధ్రాలున్న లాల్చి తొడుక్కొని వేదాంతిలా తనలో తానే నవ్వుకుంటూ రోడ్డువెంట నడుస్తున్నాడు. అతని వాలకం చూసిన ప్రజలు అతనొక పిచ్చివానిగా పరిగణించి దూరం దూరం జరుగుతున్నారు. రోడ్డువెంట నడుస్తున్న ఆ వృద్ధునికి ఉపన్యాసాలు, దేశభక్తి పాటలు వినవస్తున్నాయి.

"గాంధీ పుట్టిన దేశం
రఘురాముడు ఏలిన రాజ్యం
సమతకు, మమతకు సంకేతం_" పాట వీనుల విందుగా వినబడ్తుంది. ఈ పాట వింటున్న వృద్ధుడు మొదట మెల్లగా ఆదోలా నవ్వాడు. తర్వాత బిగ్గరగా నవ్వాడు ఆ నవ్వు అతనిలోని నిస్సహాయతను ప్రతిబింబించేలా ఉంది.

"హుం మమత, సమత- మతప్రసక్తిలేని లౌకిక రాజ్యం లో నిత్యం మతకలహాలతో మారణహోమాలు కుల సంఘాల పేరుతో, మత సంఘాల పేరుతో విభజనలు అని ఆలోచిస్తూ నడుస్తున్నాడా వృద్ధుడు

ఒకచోట ఒక నాయకమన్యుని ఉపన్యాసం ధారాళంగా సాగిపోతూ వుంది మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి ఎంతో ప్రగతిని సాధించాం. స్వాతంత్ర్యానికిపూర్వం ఆంగ్లేయులు మనలను జలగల్లా పీలుస్తూ మన దేశ సంపద నంతటిని తమ దేశానికి దోచుకునిపోయారు.

"స్వాతంత్ర్యం ఎవరికి వచ్చింది? తెల్లదొరలుపోయారు.

నల్ల దొరలు వచ్చారు. కాని దొరతన మెక్కడపోయింది? పూర్వం తెల్లవాళ్ళు పీడిస్తూ దేశ సంపదను సముద్రాలు దాటిస్తుంటే నేడు నల్లవాళ్లు తమ యిండ్లు నింపుకుంటు న్నారు. ప్రగతి- ప్రగతి ఏది ప్రగతి? స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సామాన్యుడి బ్రతుకులో వచ్చిన భేదమేమిటి? దేశ పౌరుడి జీవన ప్రమాణాలింకా దిగజారిపోతున్నాయి. మధ్య తరగతివాడు పేదగా, పేదవాడు నిరుపేదగాను దిగజారి పోయారు. దేశ సంపద కొన్ని కుటుంబాల్లోనే కేంద్రీకృత మయింది. ఈ స్వాతంత్ర్యం వచ్చి సామాన్యుడి కొరగబె ట్టిందేమిటి? పెరిగే సౌధాలు పెరుగుతూనేవున్నాయి. కూలే గుడిసెలు కూలుతూనే వున్నాయి. అవినీతి, లంచగొండితనం దోపిడీ నానాటికి పెరిగిపోతున్నవి. దినదినం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నవి. రోజురోజుకూ సామాన్యుడి బ్రతుకు దుర్భరమౌతుంది.' ఈ విధంగా ఆలో చిస్తూ విరక్తిగా నవ్వుకుంటూ నడుస్తున్నాడా వృద్ధుడు. వే రొకచోట లోకల్ ఎమ్మెల్యేగారు ''స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిరుద్యోగ నిర్మూలనకై ఎన్నో పథకాలను చేపట్టాం' అంటూ నోటికొచ్చిందల్లా వాగుతున్నాడు. ఈ మాటలు విన్న వృద్ధుడు తనలోతానే నవ్వుకున్నాడు.

'దినదినం పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యను తగ్గి స్తున్నామని చెప్పుతున్న నాయకులకు బుద్ధిలేదు. డబ్బు, రికమండేషన్ ఉన్నవాడికే ఉద్యోగం. కరడుగట్టిన అవినీతి,

ఆశ్రితజన పక్షపాతం, లంచగొండితనం ఈ దేశంలో విశృంఖల విహారం చేస్తున్నాయి. అర్హతలనుబట్టి ఉద్యోగాలివ్వాలని వేదికలపై ఉపన్యాసాలు దంచే ఈ నాయకులే ఉద్యోగాలకై రికమండేషన్లు చేస్తారు. అవి పాటించని అధికారులను ముప్పుతిప్పలు పెడుతారు. ఇక డబ్బులేని పేదవాడికుద్యోగం ఎలా దొరుకుతుంది? ఈ నాయకులు చెప్పేదంతా అబద్ధం. ఆత్మవంచన ఉపన్యాసాలతో ప్రజలను మోసగిస్తూ ఓట్లు సంపాదించడం ఆత్మవంచన' అనుకుంటూ నడచివెళ్లుతున్న ఆ వృద్ధునికి 'బాబూ! ఒక పైస' అంటూ అడుక్కుతినే ముదుసలి కనపడ్డాడు. అతన్ని చూసిన వృద్ధుడు 'నాకంటె ఇతని బ్రతుకే నయం' అనుకున్నాడు. ఆ వృద్ధుని కళ్ళముందు రోగిష్టియైన భార్య, నిరుద్యోగులైన కొడుకులు, పెళ్ళికెదిగిన కూతుళ్ళు తెరపై బొమ్మల్లా కనపడ్డారు. తనపై ఆధారపడియున్న వీళ్ళనందరి నెలా పోషించాలి? నా భవిష్యజ్జీవిత మెలా గడవాలి? అని పరిపరివిధాలుగా ఆలోచిస్తున్న ఆ వృద్ధునికి గతం తాలూకు జ్ఞాపకాలు కళ్ళముందు మెదలగా కండ్లు చెమర్చాయి. కళ్ళను తుడుచుకుంటూ రోడ్డుప్రక్కనున్న పచ్చికలోకూర్చుని దీర్ఘాలోచనలోపడ్డాడు

ఆ వృద్ధునిపేరు రామబ్రహ్మం. అదేవూళ్ళో యు. పి. యస్. హెడ్మాస్టరుగా పనిచేసి రిటైరయ్యాడు. స్వాతంత్ర్యపోరాట సమయంలో పేర్రేపితుడై స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. లాటీదెబ్బలు తిన్నాడు. జైలుశిక్ష అనుభ

వించాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. స్వాతంత్ర్యానంతరం అతన్ని రాజకీయాల్లో పాల్గొనమన్నారు. కాని అతని కది రుచించలేదు. రామబ్రహ్మంగారికి చిన్నప్పటి నుంచీ ఉపాధ్యాయవృత్తి అంటే ఎనలేని గౌరవముండేది. 'ఉపాధ్యాయుడు దేశానికి వెలుగు, భావి భారతపౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడు ప్రముఖ పాత్రధారి-' అని అతనాలోచించేవాడు. తానొక మంచి ఉపాధ్యాయుడై సుశిక్షితులైన పౌరులను తయారు చేయాలని నిశ్చయించుకున్నాడు. అందుకే ఎవరు చెప్పినా వినకుండా తాలూకాఫీసులో ఎల్. డి. సి. ఉద్యోగం లభించినా వదిలిపెట్టి, టీచర్ ట్రేనింగ్ పూర్తి చేసి, ఉపాధ్యాయ వృత్తిలో చేరాడు. తన విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తన కర్తవ్యంగా భావించాడు. రాత్రింబవళ్లు కష్టపడి విద్యార్థులకు బోధించేవాడు. ట్యూషన్‌లాంటి వేమీ తీసుకునేవాడుకాదు. తనకు "ఉత్తమ ఉపాధ్యాయుడు" అన్న బిరుదు నిచ్చి ప్రభుత్వం గౌరవించినప్పు డెంతో పొంగిపోయాడు. తన లక్ష్యం సిద్ధించినట్లుగానే కలలుగన్నాడు. తన శిష్యులైన పిల్లలు పెద్దపెద్ద ఉద్యోగాలలో చేరితే చూసి గర్వించేవాడు. ఆదర్శాలు, ఆశయాలకే తన జీవితాన్నంతా ధారబోసాడు. తాత్కాలికంగా అతడు ఆర్థికంగా ఏమాత్రం అభివృద్ధి సాధించలేదు. స్వతంత్ర భారతదేశంలో ఆంగ్లేయుల పాలనలో వలె అన్యాయాలు, అక్రమాలు ఉండవనుకున్నాడు. బ్రిటిష్

వాళ్ళు పరాయిదేశస్థులు- కాబట్టి మన దేశసంపదను దోచుకోవడానికి లంచగొండితనం, ఆశ్రితపక్షపాతాలనుచూపుతూ కులమత భేదాలను పెంచుతూ విభజించి పాలిస్తారనుకున్నాడు. స్వతంత్ర భారతదేశంలో భారతీయుని పాలనలో ఉన్న ప్రజాస్వామ్య దేశంలో అన్యాయాలు, అక్రమాలు ఉండవనుకున్నాడు. సామాన్య మానవునికి తప్పకుండా న్యాయం జరుగుతుందనుకున్నాడు. ఇంకెన్నో కలలు కన్నాడు. కాలం గడుస్తున్నకొద్దీ తన ఊహలన్నీ తలక్రిందులౌతున్నట్టుగా గమనించసాగాడు. తన ఆశయాలు, ఆదర్శాలు కేవలం పిచ్చి ఊహలుగా పరిగణించబడటం కళ్లారా చూసాడు. తన భారతీయుల పాలనలోకూడా దేశం బ్రిటిషువారి పాలనలోకంటే అధ్వాన్నంగా ఎందుకు తయారౌతుందో అర్థం కాలేదు. కాలం గడుస్తున్నకొద్దీ అతనికి కొన్ని సమయాలలో బ్రిటిషు పాలనే బాగుండేదనిపించేది.

తనతోనే తాలూకాఫీసులో ఎల్. డి. సి. గా చేరిన తన మిత్రుడు లక్షల ఆస్తిని సంపాదించాడు. తన జీతం, అతని జీతం దాదాపు సమానమే. అయినా ఇలా ఎందుకు జరిగిందో అతని కర్థమయ్యేదికాదు. ఒక్కొక్కప్పుడు తానుపని చేస్తున్న గ్రామాలలోని పెత్తందార్ల అక్రమాలనుచూసి పరితపించేవాడు. గ్రామాలలో కక్షలను, ముఠాతత్వాలను, కులమతాలపేరిట కొట్లాటలను చూసినప్పుడు అతని బాధ వర్ణనాతీతం. తానాశించిన భారతమిదేనా? అని బాధపడేవాడు.

కాని తన గృహ ఆర్థిక సమస్యలతోనే సతమతమయ్యే పేద బడిపంతు డేంచెయ్యగలడు? తనకు వచ్చే జీతం బొటాబొటిగా నెల ఖర్చులకు సరిపోయేవి. చివరకు తాను రిటైరయ్యే నాటికి తనకు ప్రభుత్వము యిచ్చిన "ఉత్తమ ఉపాధ్యాయుడు" అన్న యోగ్యతా పత్రం మరియు పెళ్ళికెదిగిన ఇద్దరు కూతుళ్ళు, నిరుద్యోగులైన ఇద్దరు కొడుకులు, రోగిష్టి భార్య, నెలకు వంద రూపాయల పింఛను మిగిలాయి. తన పదవీ విరమణ కాలాన్ని పొడిగించమని అర్జీ పెట్టుకొని ప్రభుత్వమిచ్చిన యోగ్యతా పత్రాన్ని చూపించాడు. తన నిస్సహాయ స్థితి నెంత దయనీయంగా వివరించినా అధికారులు తమ రూల్ ప్రకారమే అతన్ని రిటైర్డు చేయించారు.

పేద రామబ్రహ్మం తనకు రావలసిన గ్రాట్యుటీ గురించి కాళ్ళరిగేలా ఆఫీసులచుట్టూ తిరిగాడు. తన కిష్టంలేకున్నా ఎందరెందరి దగ్గర్నుంచో రికమండేషన్ కాగితాలు తీసుకెళ్ళాడు. కాళ్ళా వేళ్ళా పడ్డాడు. రామబ్రహ్మంగారికిదంతా అయోమయంగా ఉంది. తన దేశీయుల పాలనలోకూడా తన డబ్బు తనకివ్వడానికి విదేశీయుల పాలనలోకంటే ఎక్కువగా పైరవీలు, లంచాలు నడవడం రామబ్రహ్మంగారికి బాధగా వుంది. తుదకెలాగో కష్టపడి పదిశాతం లంచంగా ముట్టజెప్పి గ్రాట్యుటీ సంపాదించాడు. ఈ గ్రాట్యుటీ డబ్బుతో తన కొడుకులకు ఉద్యోగాలుచూస్తే తర్వాత కూతుళ్ళ పెళ్ళి చెయ్యవచ్చు ననుకున్నాడు. కాళ్ళరిగేలా తిరిగాడు. ఎందరినో బతి

మాలాడు. అభిమానం చంపుకొని మంచి స్థితిలో ఉన్న శిష్యు లనుకూడా అడిగాడు. ఫలితం శూన్యం. ప్రతి ఇంటర్వ్యూ లోనూ పరిశ్రించేది శూన్యం. ఎన్నిక ఉత్తర దక్షిణాయనా లపై ఆధారపడివుంది. వచ్చిన ఆరువేల గ్రాట్యుటీనుంచి రెండువేలు తిరగడానికే ఖర్చయింది. మిగతా డబ్బు పెద్ద కొడుక్కు ఉద్యోగమిస్తానంటే ఆ ఊళ్ళోని ఒక పైరవీకారు కిచ్చాడు. ఉద్యోగ మిప్పించమని అతనిచుట్టు ఎన్ని సార్లు తిరి గినా ఫలితంలేదు. తుదకు విసిగి డబ్బయినా వాపసు ఇవ్వ మన్నాడు. అది విన్న పైరవికారి రామబ్రహ్మంపై మండిపడి "గెటవుట్- నీవు నాకు డబ్బివ్వలేదు. దిక్కున్నచోట చెప్పుకో పో" అన్నాడు. ఆమాటలు విన్న రామబ్రహ్మం నెత్తిపై పిడుగుపడ్డట్టయింది. ఆవ్యక్తి పట్టణంలోని అతి ప్రము ఖుల్లో ఒకడు. అతనిగూర్చి ఎవరితో చెప్పినా ప్రయోజనం లేదు. తుదకా డబ్బుపై ఆశ వదులుకున్నాడు.

దీర్ఘాలోచనామగ్నుడై యున్న రామబ్రహ్మంగారు తనను చూసి బెగ్గర్ అని అనుకుంటూ పోతున్న ఒక జంటు అలికిడికి ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు. ఔను- తనకంటే బెగ్గరేనయం. వాడు అడుక్కొని అయినా బ్రతుకగలడు- కాని, తన కదీ చేతకాదు. తానిప్పు డేంచేయాలి? ఆశయాలు, ఆదర్శాలంటూ మడికట్టుకున్నందుకు తగిన ప్రతిఫలం లభించింది. స్వతంత్ర భారతంతో తన దేశీయుల పాలనగూర్చి తను కన్న కలలు పగటికలలయ్యాయి. నిరుద్యోగులైన కొడుకులు, పెండ్లి కెదిగి

గిన ఆడపిల్లలు, రోగిష్టియైన భార్య రామబ్రహ్మంగారి మనో ఫలకంముందు కదిలారు. వాళ్ళకోరకు తానేంచేయగలిగాడని? రక్తమాంసాలుడిగిపోయాయి. తనవల్ల ఎవరికీ ప్రయోజనం లేదు. తాను దేశానికేంతో చేయాలనుకున్నాడు. ప్రతిఫలంగా తనకేం మిగిలింది- చిప్ప తప్ప. తుదకు తాను స్వాతంత్ర్య యోధుల పింఛనుకూడా పొందలేకపోయాడు. వాళ్ళవీళ్ళను సర్టిఫికెట్లు సంపాదించడం తన తరంకాలేదు. తాను పెంచిన కుటుంబం కష్టాలను చూడలేడు. తాను మిగిలిస్తే పిల్లలు తమ మార్గం తాము చూసుకుంటారు. తండ్రిలేనివాళ్ళని దయామయులైనా సహాయం చేయవచ్చు. తన సమస్యకు ఆత్మహత్య ఒక్కటే పరిష్కారం. ఆత్మహత్య పాపమని పిరికి వాళ్ళలక్షణమని తెలుసు కాని ఇంతకంటే వేరే మార్గం తనకు కనబడటంలేదు. ఒక దృఢ నిర్ణయానికి వచ్చినవాడిలా లేచి నిల్చున్నాడు.

“నా దేశ పరిస్థితి ఎలావుంది? నాలాంటి అభాగ్యులీ దేశంలో ఎంతమందున్నారో” అనుకున్నాడు. పిచ్చిపట్టిన వానిలా పరుగెత్తాడు. సమీపంలోనున్న బావిలో గభాలున దూకాడు.

దేశభక్తి గీతాలు గ్రామఫోను రికార్డుల్లో మ్రోగుతూనే వున్నాయి. నాయకుల ఉపన్యాసాలు ధారాళంగా సాగుతూనే వున్నాయి. స్వాతంత్ర్యదిన వేడుకలు మహా జోరుగా జరుగుతూనే వున్నాయి. బావిలో కొనవూపిరితో నున్న

రామబ్రహ్మంగారికి 'స్వాతంత్ర్యంవచ్చెననీ సభలేచేసి సంబర పడగానే సరిపోదోయి' అనే మహాకవి పాట చివరి వీడ్కోలు పలికింది. రామబ్రహ్మంగారికి లోకంనుండి నిజమైన స్వాతంత్ర్యం నేడు లభించింది.

'అర్హతలు లేనివారు అందలాలెక్కి పూజలందుకుం టున్న నేటి కాలంలో నిజమైన స్వాతంత్ర్యయోధులు దేశభక్తిపరాయణులకు గుర్తింపులభించేకాల మెప్పుడొస్తుందో'

(మనుగడ- మే 83 సంచిక)

# 7. ఇది ముగింపు కాదు

విజయలక్ష్మి మనసు కుతకుత ఉడుకుతుంది. హృదయ మంతా భరింపరాని వేదనాభరితమై యుంది. అవమానాగ్నితో శరీరం దహించుకు పోతుంది. దూరంగా వినబడుచున్న బ్యాండు ధ్వని తన హృదయంపై సుత్తితో బాదిన ధ్వనిలా తోస్తుంది. సన్నాయనాదం తనకు చివరిసారి వీడ్కోలు పాట వలె తోస్తుంది. ఆ బ్యాండు ధ్వని తన ప్రాణాధికంగా ప్రేమిం చిన మనోహర్ పెళ్ళిది. 'మనోహర్ నన్నెందు కిలా అన్యా యం చేస్తున్నాడు? నేనేం తప్పుచేసాను? అతనినే సర్వస్వమని నమ్మాను. ఇద్దరం పెళ్ళిచేసుకుంటామని ఎన్నిసార్లు బాసలు చేసికొన్నాము- ఆ బాసలన్ని ఏమైనాయి? తుచ్ఛమైన డబ్బు ముందు ప్రేమ మమకారాలకుతావేలేదా? బాసలకర్థమే లేదా?